సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం ၊ 12 ၊ జూన్ ၊ 2024



19 నుంచి సహస్ర కలశాభిషేకం

దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో స్వామి సన్నిధిలో ఈ నెల 19వ తేదీ నుంచి మూడు రోజులపాటు సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. - 8లో



లోతు దుక్కులు మేలు..

ఖరీప్, రబీ సీజన్‌లలో వర్షం కురిసినప్పటి నుంచే కలుపు యాజమాన్య పక్రియ చేపడితే మంచి ఫలితాలు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.500	రూ.620
రెండోరకం	రూ.360	రూ.480

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు :
690 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

14న గుట్టరాళ్ల టోల్‌గేటు వేలం పాట

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొలుములపల్లె గ్రామ పంచాయతీలోని గుట్టరాళ్ల టోల్ గేటు వేలం పాటను ఈనెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కొలుములపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి జీఎల్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

న్యాక్ బృందం పరిశీలన

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలను మంగళవారం న్యాక్ బృందం పరిశీలించింది. అయోధ్యకు చెందిన డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా అవద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రామ్‌లక్ష్మణ్‌సింగ్, మహారాష్ట్ర గవర్నమెంట్ పాలిటెక్నిక్ డైరెక్టర్ డాక్టర్ నితిన్‌సోనాజి, తమిళనాడుకు చెందిన ఈఆర్. పెరుమాల్ మణిమేకలై ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ చిత్ర సదగోపన్ బృందం కళాశాలను పరిశీలించింది. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులతో వారు మాట్లాడారు. తరగతి గదులను పరిశీలించారు. కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు తదితర విషయాలను కళాశాల కరస్పాండెంట్ హరినారాయణను అడిగి తెలుసుకున్నారు.

కడప గడపలో ఏపీఎల్



ఫ్లడ్ లైట్ వెలుగుల్లో వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఆంధ్రా ప్రీమియర్ టీ-20 లీగ్ సీజన్-3 పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఇప్పటికే రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, బెజవాడ టైగర్స్, గోదావరి టైటాన్స్, వైజాగ్ వారియర్స్ పేర్లతో 6 జట్లు సిద్ధమయ్యాయి. ఏపీఎల్ సీజన్ 1, 2 వైజాగ్‌లో నిర్వహించగా, సీజన్ 3 వైజాగ్‌తో పాటు కడపలో నిర్వహించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పెద్దలు నిర్ణయించారు. దీంతో జూన్ 30వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు 7 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. 30వ తేదీ ప్రారంభోత్సవ వేడుకలతో పాటు డే అండ్ నైట్ మ్యాచ్ నిర్వహించనుండగా, జూలై 1, 2, 3 తేదీల్లో ప్రతిరోజూ రెండు మ్యాచ్‌లు చొప్పున 6 మ్యాచ్‌లు డే అండ్ నైట్‌లలో నిర్వహించనున్నారు. కాగా ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో తొలిసారిగా నిర్వహించనున్న మ్యాచ్ లను క్రీడాభిమానులు ఉచితంగా వీక్షించవచ్చని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భరత్‌రెడ్డి, ఎ.రెడ్డిప్రసాద్ తెలిపారు. మ్యాచ్‌ల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను కేడీసీఏ పూర్తిచేస్తోందని తెలిపారు. కడప వేదికగా మూడు ఏపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం లభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్-1, స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం చేసునున్నారు.

శుభ కార్యాలకు బ్రేక్!

- శ్రావణం వరకూ మోగని పెళ్లి బాజాలు
- జూలై 8 వరకూ శుక్రమూఢం
- ఆపై ఆషాఢ శూన్యం
- ఆగస్టు 7 తర్వాతే వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాలు
- మళ్లీ సెప్టెంబర్ 4 నుంచి అక్టోబర్ 3 వరకూ శూన్య మాసం



మదనపల్లె సిటీ: ఈ ఏడాది శుభ ముహూర్తాలకు మూఢం అడ్డుపడింది. నెల రోజుల తరువాత మరోసారి శూన్యమాసం శుభకార్యాలకు ఆటంకంగా మారింది. దీంతో ప్రస్తుతం ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి బాజాలకు బ్రేక్ పడింది. ఏప్రిల్ 28 నుంచి వరుసగా మూఢం రావడంతో రెండున్నర నెలలుగా వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు వంటి శుభ కార్యాలు నిలిచిపోయాయి. క్రోధి నామ సంవత్సరం ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమై 26వ తేదీ చైత్ర మాసం వరకూ కొనసాగాయి. ఏప్రిల్ 28వ తేదీ చైత్ర చవితి ఆదివారం నుంచి జులై ఎనిమిదో తేదీ వరకూ ఆషాఢ శుద్ధ తదియ వరకూ శుక్రమౌఢ్యమి (మూఢం) నడుస్తోంది. మే 7 నుంచి చైత్ర బహుళ చతుర్థశి మంగళవారం నుంచి జూన్ ఏడో తేదీ వరకూ గురు మౌఢ్యమి నడిచింది. వరుసగా గురు, శుక్ర మౌఢ్యములు రావడంతో రెండు నెలలుగా వివాహాలకు ఆటంకం ఏర్పడింది. మరో వైపు జులై ఐదో తేదీ నుంచి ఆషాఢ మాసం ప్రారంభం అవుతుంది. ఆషాఢ మాసం ఆగస్టు ఐదో తేదీ వరకు కొనసాగుతుంది. ఇది శూన్యమాసం కావడంతో ఈ నెలలో కూడా వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు వంటి శుభ కార్యాలు నిర్వహించరు. మొత్తం మీద ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి బాజాలు మోగే అవకాశం లేదని పండితులు, పురోహితులు చెబుతున్నారు. మూఢంలో కేవలం అన్నప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్ల వంటి పనులకు మౌఢ్యమిలోని మంచి రోజుల్లో చేసుకోవచ్చని పండితులు సూచిస్తున్నారు. సెప్టెంబర్ నాలుగో తేదీ నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకు భాద్రపదం కూడా శూన్యమాసంలో కావడంతో ఈ నెలలో వివాహాల ముహూర్తాలు ఉండవు.

ఉపాధికి గండి



వివాహ వేదిక

జిల్లాలో ప్రధానంగా మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు ప్రాంతాల్లో అధికంగా కళ్యాణ మండపాలు ఉన్నాయి. గత రెండున్నర నెలలుగా వివాహ ముహూర్తాలకు మూఢాలు అడ్డంకి కావడంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. మదనపల్లె నీరుగట్టువారిపల్లె పట్టుచీరల విక్రయానికి ప్రసిద్ధి. మూఢం కారణంగా వ్యాపారాలు నిలిచిపోయాయి. కేవలం వివాహాలపై ఆధారపడి ఎన్నో వృత్తుల వారు జీవనం సాగిస్తున్నారు. కళ్యాణ మండపాలు, కేటరింగ్, వంటవాళ్లు, పురోహితులు, ఫోటో, వీడియో గ్రాఫర్స్, ట్రావెల్స్ కార్లు, బస్సులు, మినరల్ వాటర్స్, ఈవెంట్ మెనేజ్‌మెంట్లు, పూలు, డెకరేషన్స్, లైటింగ్, కూరగాయలు, కిరాణా, వస్త్ర, బంగారు వ్యాపారాలు, షామియానాలు, లాడ్జీలతో పాటు సాంస్కృతిక కళాకారులకు పని లేకుండా పోయింది. మరెంతో మంది రోజువారీ కూలీలకు ఉపాధి కొరవడింది. అడపాదడపా చిన్న చిన్న ఫంక్షన్లు జరుగుతున్నా, పెళ్లిళ్లు అయితేనే సరైన గిరాకీ లభిస్తుందని ఆయా వర్గాల మాట. ఆగస్టు ఏడో తేదీ వరకూ మళ్లీ ఎదురు చూపులు తప్పవని పేర్కొంటున్నారు.

శ్రావణంలో దివ్యమైన ముహుర్తాలు



గురు,శుక్ర మౌఢ్యాలు వరుసగా రావడంతో వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాలు 70 రోజుల పాటు నిలిచిపోయాయి. ఏప్రిల్ 28 తర్వాత వివాహాలకు ఇంత వరకు మళ్లీ ముహూర్తాలు లేవు. శ్రావణమాసంలో ఆగస్టు 7 నుంచి 28 వరకూ నాలుగైదు రోజులు మినహా దివ్యమైన ముహుర్తాలు ఉన్నాయి. సెప్టెంబర్‌లో మళ్లీ బాద్రపదమాసం శూన్యమాసం కావడం వలన వివాహ ముహూర్తాలు ఉండవు.

–సాయిచక్రవర్తి,
వేదపండితులు, మదనపల్లె

ఇంటర్ విద్య..ఇంటికి చేరువగా.!

- మదనపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో జూనియర్ ఇంటర్‌కు అనుమతి
- ఈ ఏడాది నుంచి ఎంపీసీ, సీఈసీ తరగతులు



పాఠశాలలో ఇంటర్ తరగతులకు బోధిస్తున్న అధ్యాపకురాలు

మదనపల్లె సిటీ: గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో విద్యాశాఖ మండల స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. మనబడి, నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం ఇప్పటికే సమూలంగా మార్చింది. అన్ని ఆధునిక వసతులూ కల్పించింది. అవే ప్రాంగణాలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేస్తోంది. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. ఈ ఏడాది బాలబాలికలకు (కో -ఎడ్యుకేషన్) జూనియర్ ఇంటర్ తరగతులు ప్రారంభించింది. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే అవస్థలు ఈ ప్రాంత విద్యార్థులకు తొలగాయి. ఫలితంగా చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా, దూరాభారం వల్ల అర్ధంతరంగా చదువుకు స్వస్తి చెప్పే గ్రామీణ పేద విద్యార్థుల సంఖ్య బాగా తగ్గుతుంది.

అందుబాటులో రెండు గ్రూపులు

ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో డిమాండ్ ఉన్న ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు అనుమతి ఇచ్చారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీసీలో 40 సీట్లకు 30 సీట్లు భర్తీ అయ్యాయి. సీఈసీలో 40 సీట్లకు 25 సీట్లు భర్తీ అయ్యాయి. కళాశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు పరిసర గ్రామాలకు వెళ్లి స్వయంగా అడ్మిషన్లు చేయిస్తున్నారు.

ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్



ఈ ఏడాది నుంచి హైస్కూల్ ప్లస్‌గా మారిన జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. పరిసర గ్రామాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నాం. పదో తరగతి తర్వాత ఏ ఒక్కరూ చదువు మానేయకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అందుకనుగుణంగా జెడ్పీహెచ్ఎస్‌లో ప్లస్‌లో ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి.

–సుబ్బారెడ్డి, హెచ్ఎం,మదనపల్లె

దుర్గమ్మా.. దీవించమ్మా..



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

– కడప కల్చరల్

హార్సిలీహిల్స్‌పై ఆధ్యాత్మిక శోభ

హంస వాహనంపై ఊరేగిన ఏనుగు మల్లమ్మ





హంస వాహనంలో ఏనుగు మల్లమ్మ, ఆలయానికి దీలు మోసుకొస్తున్న భక్తులు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మంగళవారం రాత్రి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. ఏనుగు మల్లమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఏనుగు మల్లమ్మ పుట్టిన ఊరు బయ్యప్పగారిపల్లె నుంచి పట్టు వస్త్రాలను గ్రామస్తులు సమర్పించారు. అనంతరం గణపతి పూజ జరిపి, అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో కుంకుమార్చన, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జి.మదన్‌మోహన్‌రెడ్డి దంపతులు ఏనుగు మల్లమ్మకు విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మధ్యాహ్నం యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం కోటావూరు, బందారువారిపల్లె, బయ్యప్పగారిపల్లె పంచాయతీల నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి దీలు మోశారు. ఆలయానికి తీసుకొచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి హంస వాహనంలో కొలువుదీర్చిన ఏనుగుమల్లమ్మ ఉత్సవ విగ్రహంతో హార్సిలీహిల్స్‌పై ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

గుహలో పూజలు

ఏనుగు మల్లమ్మ ఆలయానికి తూర్పున హార్సిలీహిల్స్ కొండ అంచున గుహలో వెలసిన వెంకటేశ్వరస్వామి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ మేళతాళాలు, కాగడాలతో గుహలోకి వెళ్లిన భక్తులు, అర్చకులు పూజలు జరిపారు. ఏనుగు మల్లమ్మ ఉత్సవాల సమయంలో ఈ గుహలో వెలసిన స్వామికి పూజలు జరపడం ఆనవాయితీగా వస్తోంది.

అమాత్యులు అయ్యేదెవరో?

- జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రి పదవులపై శ్రేణుల్లో చర్చలు
- తెరమీదికి తొలిసారి గెలిచిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్లు
- మైనార్టీ కోటాలో షాజహాన్‌కు బెర్త్ దక్కుతుందని ఆశ
- టీడీపీ అధికారంలోకి రావడంతో గెలిచిన అభ్యర్థుల్లో రేకెత్తుతున్న ఆశలు
- ఈసారి జనసేన సీనియర్లకు అవకాశం నేపథ్యంలో రైల్వేకోడూరుకు నో ఛాన్స్



మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి





నల్లారి
కిశోర్‌కుమార్‌రెడ్డి

సాక్షి రాయచోటి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కూటమి తిరుగులేని విజయం నమోదు చేయడంతో అమాత్య పదవులపై జిల్లాలో నేతలకు ఆశలు మొదలయ్యాయి. టీడీపీ, జనసేన పార్టీల బి-ఫారాలతో గెలిచిన ఎమ్మెల్యేల్లో ఆశల మోసులు మొలుస్తున్నాయి. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు అమరావతిలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో మంత్రుల జాబితాలో ఎవరి పేర్లు ఉంటాయోనన్న ఉత్కంఠ నెలకొంది. అయితే ఆయా పార్టీల అధిష్టానాలు ఎక్కడా కూడా పేర్ల జాబితా బయటికి పొక్కనీయలేదు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి కొన్ని గంటలముందు అమాత్యుల పేర్లు బయటికి వస్తాయని ప్రచారం జరుగుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని అన్ని స్థానాలు కైవసం చేసుకోగా, 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రెండు స్థానాలకే పరిమితం కాగా, మిగిలిన నాలుగు స్థానాలను కూటమి అభ్యర్థులు దక్కించుకున్నారు.

తెరమీదికి నల్లారి, మండిపల్లి రాముడు

రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయాన్ని నమోదు చేయగా జిల్లాలో తొలిసారిగా రాయచోటి పీఠంపై మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి (రాముడు), పీలేరు సెగ్మెంట్‌లో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి విజయదుందుభి మోగించారు. అయితే చంద్రబాబు మంత్రి వర్గంలో తొలిసారి గెలిచిన వీరిలో ఎవరో ఒకిరికి మంత్రి పదవి లభిస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పీలేరులో పలుమార్లు టీడీపీ తరుపున కిశోర్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తూ వచ్చారు. ఈసారి కూడా పీలేరు ఎమ్మెల్యే స్థానానికి కిశోర్‌కుమార్‌రెడ్డి పోటీ చేయగా, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేశారు. ఇరువురు అన్నదమ్ములు కావడం, పార్టీ కోసం బాగా కష్టపడడంతో ఈసారి పీలేరు ఎమ్మెల్యేగా ఎన్నికైన కిశోర్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. అలాగే రాయచోటి నుంచి తొలిసారిగా ఎన్నికైన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేరు కూడా అమాత్యుల జాబితాలో ఉంటుందని జోరుగా ప్రచారం సాగుతోంది. టీడీపీ అధినేత చంద్రబాబుతోపాటు ఆయన కుమారుడు లోకేష్‌తో కూడా రాంప్రసాద్ రెడ్డికి సత్సంబంధాలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన రాయచోటిలో గెలుపు బావుటా ఎగురవేసిన నేపథ్యంలో మండిపల్లికి మంత్రి పదవి ఇస్తారని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

రైల్వేకోడూరుకు నో ఛాన్స్

రాష్ట్రంలో కూటమి ఘన విజయంలో కీలకంగా వ్యవహరించిన జనసేనకు కొన్ని మంత్రి పదవులను కేటాయిస్తున్నారు. అయితే ఈసారికి ప్రధానంగా పవన్ కల్యాణ్‌తోపాటు మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, ఇతర ముఖ్య నేతలకు అమాత్య పదవుల్లో పెద్దపీట వేసేలా కనిపిస్తోంది. అంతేకాకుండా జనసేన గెలిచిన 21 సీట్లలో కొంతమంది సీనియర్ నాయకులు కూడా ఉన్న తరుణంలో వారిని కాదని రైల్వేకోడూరుకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదని జనసేన నాయకులు పేర్కొంటున్నారు. అయితే రైల్వేకోడూరు చరిత్రలో తొలిసారి జనసేన జెండా ఎగురవేయడంపై ఇప్పుడు కాకున్నా భవిష్యత్తులో అవకాశాలు రావచ్చని పార్టీలో చర్చ నడుస్తోంది. ఏదిఏమైనా జిల్లాలో మంత్రి పదవులపై పలువురు ఎమ్మెల్యేలు ఆశలు పెట్టుకున్నారు.

మైనార్టీ కోటాలో షాజహాన్‌కు ఛాన్స్?



షాజహాన్‌బాషా

జిల్లాలోని మదనపల్లె నుంచి గెలుపొందిన షాజహాన్‌బాషాకు మైనార్టీ కోటాలో అవకాశం ఉంటుందని టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. అయితే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ మైనార్టీ అభ్యర్థులు గెలిచినా మదనపల్లెలో ఈసారి టీడీపీ తరుపున షాజహాన్ బాషా జెండా ఎగురవేశారు. అంతకుముందు కూడా ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో సీనియర్ మైనార్టీ నేతగా ఆయనకు ఛాన్స్ దక్కే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు ఆశిస్తున్నారు.


ఈఏపీసెట్‌లో మెరిశారు



తల్లిదండ్రులతో ప్రణీత



తల్లిదండ్రులతో చింతల మహిత రెడ్డి



తల్లిదండ్రులకు స్వీట్ తినిపిస్తున్న గగన్‌శ్యాం రెడ్డి

మదనపల్లె సిటీ: ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, జేఎన్‌టీయూ కాకినాడ వైస్ చాన్సలర్ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ రామమోహన్‌రావు తదితరులు ఏపీ ఈఏపీసెట్ పరీక్షా ఫలితాలు విడుదల చేశారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రణీత.. ప్రతిభ

మదనపల్లెకు చెందిన ఆలూరి ప్రణీత అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు కైవసం చేసుకుంది.అగ్రికల్చర్ విభాగంలో 5వ ర్యాంకు సాధించిన ఆలూరి ప్రణీత తెలంగాణ ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు సాధించింది. అలాగే మెడికల్ ఎంట్రన్స్‌కు సంబంధించి జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఆలిండియా స్థాయిలో 674వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 398వ ర్యాంకు సాధించి ప్రతిభ చూపింది. మదనపల్లె పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన శ్రీకర్ పట్టణంలో హోమియో వైద్యులు. తల్లి కళ్యాణి ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. ప్రణీత టెన్త్‌లో 589 మార్కులు సాధించి ఇంటర్మీడియట్ శ్రీ చైతన్య విజయవాడలో బైపీసీ చదివింది. ఇంటర్‌లో 982 మార్కులు సాధించింది. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో లేదా, జిప్‌మర్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో సీటు సాధించి కార్డియాక్ సర్జన్ చదవాలనుందని ప్రణీత తెలిపింది.

కలికిరి: మండలంలోని గుండ్లూరు గ్రామం కొర్న మిట్టపల్లికి చెందిన విద్యార్థిని చింతల మహిత రెడ్డి ఏపీ ఎంసెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో 219వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటుకుంది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్ కుమార్ రెడ్డి, చింతల మాధవిల కుమార్తె మహితరెడ్డి ఇటీవల వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లోనూ ఆల్ ఇండియా పరిధిలో 776, జనరల్ (ఈడబ్ల్యుఎస్) కేటగిరిలో 73 ర్యాంకు సాధించింది. ముంబై ఐఐటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సాధించడమే లక్ష్యమని, ఉన్నత చదువులు చదివి సమాజ సేవలో భాగ్యస్వామినవుతానని పేర్కొంది.

సింహాద్రిపురం: సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామానికి చెందిన గగన్ శ్యాంరెడ్డికి 875వ ర్యాంకు వచ్చింది. ఈ విద్యార్థి హిందూపురం సువర్ణభారతి కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. రాష్ట్రస్థాయిలో విద్యార్థికి ర్యాంకు రావడం పట్ల కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో ర్యాంకులు సాధించిన మరికొందరు..

రాయచోటి: 1. కొండూరు శశిధర్, తండ్రి హేమకుమార్,(99 ర్యాంకు), వీపీఆర్ కండ్రిగ, కోడూరు మండలం
2. ఆకేపాటి దినేష్ ప్రసాద్‌రెడ్డి, తండ్రి లక్ష్మీ నరసారెడ్డి,(116), దేవమాచుపల్లి, చిట్వేలి మండలం
3. కె.ప్రభాకర్‌రెడ్డి, తండ్రి సుదర్శన్ రెడ్డి,(203), కేశాపురం రెడ్డివారిపల్లి, చిన్న మండెం మండలం
4. ఏనుగంటి హేమంత్, తండ్రి చెంగయ్య,(217), తట్టివారిపల్లి, మదనపల్లి
5. పోలి హితేశ్‌రెడ్డి, తండ్రి సుదర్శన్‌రెడ్డి,(261), మందరం మన్నూరు, రాజంపేట
6. పి.వెంకటవిశ్వసాయి, తండ్రి ఈశ్వరయ్య,(287), ఎస్‌బీఐ కాలనీ, మదనపల్లి
7. ముతుకూర్ మనూప్, తండ్రి ఉమాశంకర్,(487), మదనపల్లి
8. ఆర్.గిరీషవర్ధన్‌రెడ్డి, తండ్రి గంగిరెడ్డి,(507), చెన్నముక్కపల్లి, రాయచోటి
9. జి.భానుశంకర్, తండ్రి వెంకటనారాయణ,(695), కావలిపల్లి, టి.సుండుపల్లి

ప్రొద్దుటూరు విద్యార్థుల సత్తా



పవన్ కుమార్

ప్రొద్దుటూరు కల్చరల్: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో ప్రతిభకనబరిచి మంచి ర్యాంకులు సాధించారు. స్థానిక శాంతకుమారి వీధికి చెందిన ఎస్.భాస్కర్, లక్ష్మిల కుమారుడు ఎస్.పవన్ కుమార్ 211వ ర్యాంకు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓబీసీ కేటగిరిలో 163వ ర్యాంకు సాధించాడు. సీఎస్ఈ కంప్యూటర్ సైన్స్ చదివి స్టార్టప్ కంపెనీ పెట్టడం తన లక్ష్యమని పవన్ కుమార్ తెలిపాడు.




తోటంశెట్టి నిఖిలేష్

- కేకే స్ట్రీట్‌కు చెందిన తోటంశెట్టి శ్రీనివాసులు, అరుణల కుమారుడు తోటంశెట్టి నిఖిలేష్ 62వ ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో 20వ ర్యాంక్, అడ్వాన్స్‌డ్‌లో 1377వ ర్యాంకు సాధించాడు. సివిల్స్ రాసి ఐఏఎస్ అయి పేద ప్రజలకు సేవ చేస్తానని నిఖిలేష్ తెలిపాడు.



వెంకటతనీష్‌రెడ్డి

- స్థానిక సాయిరాజేశ్వరి కాలనీకి చెందిన అన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, దేవిల కుమారుడు అన్నారెడ్డి వెంకటతనీషరెడ్డి 44వ ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో ఓసీ కేటగిరిలో 21వ ర్యాంక్, అడ్వాన్స్‌డ్‌లో 420వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో చేరి కంప్యూటర్ సైన్స్‌లో ఉత్తమ ఇంజినీర్‌గా రాణిస్తానని వెంకట తనీష్ రెడ్డి తెలిపాడు.



అశ్వర్థ కార్తీక్ రెడ్డి

- స్థానిక వసంతపేటకు చెందిన కె.అశ్వర్థ కార్తీక్ రెడ్డి 148వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి తండ్రి నీలమోహన్‌రెడ్డి తాళ్లమాపురం జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా తల్లి లక్ష్మి గృహిణి. జేఈఈ మెయిన్స్‌లో 474వ ర్యాంకు, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1389వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో సీఎస్ఈ చేరి కంప్యూటర్ రంగంలో రాణిస్తానని అశ్వర్థ కార్తీక రెడ్డి తెలిపాడు.

క్లుప్తంగా

స్కిల్ హబ్‌తో యువతకు ఉపాధి

రాయచోటి టౌన్ : స్కిల్ డెవెలప్‌మెంట్ సెంటర్ ద్వారా యువత ఉపాధి పొందాలని రాయచోటి పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ శివశంకర్ పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర స్కిల్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల యందు స్కిల్ హబ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్కిల్ హబ్ సెంటర్ ద్వారా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ టైలరింగ్ కోర్సు నందు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని, అర్హతను బట్టి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్(హౌసింగ్)కోర్సులో శిక్షణకు పది, ఐటీఐ డిప్లొమా చేసిన వారు, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ టైలరింగ్ కోర్సుకు ఎనిమిదో తరగతి చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు నేరుగా రాయచోటి పాలిటెక్నిక్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9550104260/ 9381069980కు ఫోన్ చేసి వివరాలు తెలుపవచ్చునన్నారు.

జూదరుల అరెస్టు

రాయచోటి టౌన్: పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామం గంగోత్రి వాటర్ ప్లాంట్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ భక్తవత్సలం, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద రూ.21,000ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మదనపల్లెలో ఒంటె చోరీ ఫుటేజీ లభ్యం

– ముగ్గురి యువకుల ప్రమేయం



ఒంటెను తోలు కెళ్తున్న సీసీ ఫుటేజీ దృశ్యం

కురబలకోట : రెండు రోజుల కిందట కురబలకోట మండలం అంగళ్లులో చోరీకి గురైన ఒంటి మదనపల్లెకు చేరినట్లు వెల్లడవుతోంది. బక్రీద్ కోసం తెచ్చుకున్న ఒంటి దొంగలించడం చర్చనీయాంశమైంది. ఆదివారం వేకువ జామున అంగళ్లు నుండి ముగ్గురు యువకులు దానిని తోలుకెళ్లినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో కనిపించింది. ముగ్గురు యువకుల్లో ఒకరు మోటార్ సైకిల్ డ్రైవింగ్ చేస్తుండగా, మిగిలిన ఇద్దరు ఒంటెను తాడుతో పట్టుకుని వేగంగా విశ్వం కళాశాల, సర్కారుతోపు, అమ్మచెరువు మిట్ట మీదుగా మదనపల్లె ఎన్టీఆర్ సర్కిల్ నుండి స్థానిక విశాల్ మార్కెట్ వరకు నడిపించు కెళ్తున్న దృశ్యాలు సీసీ కెమేరాలో కనిపించాయి. అనుమానితులను గుర్తిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

లోతు దుక్కులతో కలుపు నివారణ

- జిల్లాలో వర్షం కురవడంతో పొలాల్లో రైతులు
- దుక్కులు చేసుకుంటే చీడ పీడల నివారణ సాధ్యం
- భూగర్భ జలాలు నిల్వ చేసేందుకు అవకాశం
- 75189 హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగు లక్ష్యం

ఖరీఫ్, రబీ సీజన్‌లలో కలుపు సమస్య పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షం కురిసినప్పటి నుంచే కలుపు యాజమాన్య పక్రియ చేపడితే మంచి ఫలితాలు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వర్షం కురవగానే భూమి లోని విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉన్నందున పంటల సాగు సమయానికి రెండు సార్లు లోతు దుక్కులు(సేద్యాలను) చేస్తే కలుపు నివారించుకోవచ్చునని చెబుతున్నారు. రైతుల కోసం ఈ సందర్భంగా కలుపు నివారణా సూచనలివీ..



ట్రాక్టర్‌లో దుక్కులు చేస్తున్న రైతన్నలు

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 75,189 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తారు. జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవడంతో కాస్త వర్షం కురిస్తే చాలు.. ఆరుతడి పంటలైన సజ్జ, జొన్న, మొక్క జొన్న, కంది, పెసలు, మినుములు, పత్తి, వేరుశనగ, సన్ ఫ్లవర్, సోయాబీన్ తదితర పంటలు సాగు చేసేందుకు రైతన్న సిద్ధమవుతున్నారు.

మారిన వ్యవసాయ పద్ధతులతో వివిధ పంటల్లో కలుపు నివారించేందుకు రైతులు వివిధ రకాల కలుపు మందులపై ఆధారపడుతున్నారు. విత్తనం వేశాక, పైరు పెరిగే దశలోనూ కలుపు నివారణ చేపడుతున్నారు. మందులను పిచికారీ చేయడంతో భూమి సారవంతం దెబ్బతినే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులలో కలుపు నివారించుకోవాలని సూచిస్తున్నారు.

పంట నూర్పిడి తరువాత

పంటల నూర్పిడి తరువాత తిరిగి వర్షాకాలం వచ్చే వరకు చాలామంది రైతులు భూమిని దున్నకుండా వదిలేస్తారు. దీంతో భూమిలో కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి సత్తువ లేకుండా చేస్తాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో రైతులు పంటలు సాగు చేసుకునే సమయానికి లోతు దుక్కులు చేపడితే బోలెడు లాభాలు ఉన్నాయి. లోతు దుక్కులు చేయడంతో భూమి పై పొరలు కిందకు, కింద పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. భూమిలో ఉండే పురుగులు, కలుపు మొక్కల నివారణ జరుగుతుంది. వేసవిలో చాలా మంది రైతులు పశువులు, ఆవులు, గొర్రెల పెంట, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లుతారు. ప్రస్తుతం దుక్కులు చేయడంతో అవన్నీ భూమిలో కలిసి సారవతంగా మారుతుంది. ఎక్కువకాలం తేమను కలిగి ఉంటుంది.

పంటలు లేనప్పుడే...

వేసవిలో చాలా వరకూ భూమి ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు కోత దశల్లో నిద్రావస్థ దశలో నేల, చెత్తా చెదారం, కోయ కాడల్లో ఎక్కువకాలం గడుపుతాయి. అలాగే తెగుళ్లను కలుగ చేసే శిలీంద్రాలు భూమిలోపల ఆశ్రయం పొందుతాయి. వాటి శిలీంద్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. ప్రస్తుతం కురిసిన వర్షంతో లోతు దుక్కులతో నిద్రావస్థ దశలో భూమిలోని చీడ పురుగు కోశాలు, గుడ్లు, లార్వాలు పక్షులు, కొంగలు, కాకులు తిని నాశనం చేస్తాయి. దీంతోపాటు కలుపునకు సంబంధించిన విత్తనాలు కూడా చనిపోతాయి.

లోతు దుక్కులు చేపట్టాలి

ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. నేల పదును కావడంతో రైతులు తమ బీడు భూములలో లోతుగా దుక్కులు చేసుకోవాలి. దీంతో వ్యవసాయ భూమి సారవంతంగా మారుతుంది. లోతు దుక్కులతో భూమిలో ఉన్న చీడపీడలలతోపాటు కలుపు నివారణతో నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. దీంతోపాటు భూమిలో తేమ శాతం పెరుగుతుంది. – అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయాధికారి, వైఎస్సార్ జిల్లా

ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో ..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకుని మాగాణి, మెట్ట, బీడు భూములను దున్నుకోవాలి. ముఖ్యంగా దుక్కులను లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలు, అడ్డం దున్నడంతో వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది, భూమి ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగు తుంది, సాధారణంగా రైతులు పంట చేతికి రాపంట నుంచి వచ్చే ఎండు ఆకులు, చెత్తా చెదారం కాల్చివేయకుండా అలాగే వదిలేసి ఉంటారు. ఈ వర్షంతో లోతు దుక్కులు చేయడంతో నేలల్లో కలిసిపోయి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. లోతు దుక్కులు చేయడంతో కలుపు మొక్కలు నశించిపోతాయి.

భూ ఆక్రమణకు యత్నం

రాఘవరాజుపురంలో 30 సెంట్ల భూమి చదును



భూ ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్తులు

రైల్వేకోడూరు అర్బన్ : అక్రమార్కులు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. రైల్వేకోడూరు మండలం రాఘవరాజుపురం గ్రామంలోని ముస్టేరు వద్ద ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న 35 సెంట్ల భూమి విలువ రూ.2 కోట్లకుపైనే ధర పలుకుతోంది. గత పదేళ్లుగా ఈ స్థలం ఆక్రమించేందుకు పలు వర్గాలు ప్రయత్నం చేస్తున్నాయి. స్థానికులు అడ్డుకుంటూ ప్రతిసారీ నివారిస్తున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రామిరెడ్డి ధ్వజారెడ్డి తదితరులు గతంలో ఇక్కడ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇది ఆలస్యమైంది. తిరిగి మంగళవారం కొందరు అక్రమార్కులు ఆర్ అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించేందుకు చదును చేశారు. స్థానికులు అడ్డుకొని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు, నాయకులు దృష్టిపెట్టి ఆ స్థలం ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాసులు రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, డి.అనిల్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, డి.శివారెడ్డి, గురుబ్రహ్మారెడ్డి, బుల్లెట్ శివ, నాగేంద్రరెడ్డి, సభాపతి, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరు దుర్మరణం





మృతులు పేరూరు కొండయ్య, కోనేటి గంగమ్మ (ఫైల్)

ఒంటిమిట్ట : అధిక విద్యుత్తు సరఫరాతో విద్యుత్తు షాక్‌కు గురై ఇద్దరు మృతి చెందారు. మండలంలోని ఇబ్రహీంపేట ఎస్సీ కాలనీలో విద్యుత్ షాక్ తగిలి కోనేటి గంగమ్మ(69), పేరూరు కొండయ్య (51) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన కోనేటి గంగమ్మ తన ఇంట్లో ఫ్రిడ్జ్ తెరిచేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందారు. ఇంట్లో ఉన్న కోనేటి గంగమ్మ మనువడు తన నాన్నమ్మకు ఏమైందో తెలియక కేకలు పెట్టాడు. అటుగా వెళ్తున్న పేరూరు కొండయ్య కోనేటి గంగమ్మ నేలపై పడి ఉండడం చూసి ఏమైందోనని తెలుసుకునేందుకు ఆమెను పట్టుకోగా అతడు విద్యుత్ షాక్ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. 108 సహాయంతో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కోనేటి నరసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు. విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి చెందడంతో ఒంటిమిట్ట విద్యుత్తు అధికారులు విచారణ చేపట్టారు. ఏఈ ఉదయ్ కుమార్ వివరణ కోరగా న్యూట్రల్ ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందన్నారు. మృతులకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం వచ్చేలా చేస్తామని తెలిపారు.

నదిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య



పెన్నానదిలో శవమై కనిపించిన వల్లెపు నరసమ్మ

సిద్దవటం : ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఓ వృద్ధురాలు పెన్నానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. అట్లూరు మండలం గాండ్లపల్లె గ్రామానికి చెందిన వృద్ధురాలు వల్లెపు నరసమ్మ(75) సిద్దవటం వద్ద పెన్నా నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుందని ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ అట్లూరు మండలం గాండ్లపల్లె గ్రామానికి చెందిన వల్లెపు నరసమ్మకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. ఆమె భర్త యానాదయ్య 13 సంవత్సరాల కిందట చనిపోయారు. ఇటీవల ఆమెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కుమారులు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయిస్తామంటే సూదులు వేస్తారు..మాత్రలు దండిగా ఇస్తారు అంటూ చెబుతుండేది. ఈ నెల 9వ తేదీన భాకరాపేట చర్చికి వెళ్లిన నరసమ్మ చర్చికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, వారి కుమారులు, బంధువులు గాలించినా కనిపించలేదన్నారు. సిద్దవటంలోని ఆకులవీధి గ్రామ సమీపంలోని పెన్నా నదిలో మంగళవారం ఉదయం శవం ఉన్నట్లు తెలియడంతో సిబ్బందితో వెళ్లి పరిశీలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. నరసమ్మ మృత దేహాన్ని గుర్తించి బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంట్

ప్రొద్దుటూరు : అత్యుత్తమ భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంట్ అని భారతి సిమెంట్ కంపెనీ జిల్లా టెక్నికల్ ఇంజనీర్ కె.నాగేంద్ర పేర్కొన్నారు. స్థానిక ఆటో నగర్‌లోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో తాపీ మేస్త్రీలకు మంగళవారం సిమెంట్ నాణ్యత, వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 40 మంది మేస్త్రీలకు లక్ష రూపాయల ఉచిత బీమా బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సిమెంట్ రోబోటిక్, జర్మనీ టెక్నాలజీతో తయారవుతోందన్నారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఇతర రకం సిమెంట్ ఐదు గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రా ఫాస్ట్ 2 గంటల్లోనే సెట్ అవుతుందని తెలిపారు. ఈ సిమెంట్ చాలా దృఢత్వాన్ని కలిగి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీ ఏజెన్సీస్ డీలర్ మురళి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉచిత న్యాయ సహాయం

– జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్

కడప అర్బన్ : సమాజంలో ట్రాన్స్ జెండర్లకు కొన్ని హక్కులతోపాటు, ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు వుందని జిల్లా న్యాయసేవాధికాసంస్థ కార్యదర్శి, జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. కడప జిల్లా కోర్టు ఆవరణలోని 'న్యాయ సేవా సదన్'లో మంగళవారం ట్రాన్స్ జెండర్ల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లింగ మార్పిడి వ్యక్తులు విద్య లేకపోవడం, నిరుద్యోగం, ఇల్లు లేకపోవడం, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల కొరత, నిరాశ, మద్యం, దుర్వినియోగంతో సామాజిక అణిచివేతకు గురవుతారన్నారు. వారి పరిరక్షణకు భారత రాజ్యాంగం, సుప్రీంకోర్టు 'థర్డ్ జెండర్'గా గుర్తించబడే హక్కు ఇవ్వడంతో పాటు కొన్ని సంక్షేమ చర్యలను చేపట్టిందన్నారు. వారసత్వపు హక్కు సెక్షన్ 6, 7,18, 354 కింద ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, వన్‌స్టాప్ సెంటర్ విధులు, పారా లీగల్ వాలంటీర్ల విధులు, లీగల్ ఎయిడ్ క్లినిక్ విధులు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి.కృష్ణ కిషోర్, ఎస్.రవిబాబు, ఆర్.సుభాష్ యాదవ్, సయ్యద్ హాసం, భాస్కర్, నస్రీన్, పి.మనోహర్, సారిక, ఎన్జీవోలు, ట్రాన్స్‌జెండర్స్‌లు పాల్గొన్నారు.

వీడియో గ్రాఫర్ల క్రికెట్ సందడి



క్రికెట్ విజేతలతో నిర్వాహకులు

కడప కల్చరల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్లు ఆట విడుపుగా మూడు రోజులపాటు క్రికెట్ ఆడి ఆనందించారు. ఆంధ్రప్రదేశ్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో కలిసి కడప జిల్లా శాఖ బృందాలు, జిల్లా వ్యాప్తంగా మొత్తం మూడు టీములు టోర్నమెంటులో పాల్గొన్నాయి. కడప పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం ఫైనల్స్ నిర్వహించారు. నగరానికి చెందిన లోకేష్ బృందం విజేతగా, బద్వేల్‌కు చెందిన ఫొటో, వీడియోగ్రాఫర్ల బృందం రన్నర్స్‌గా నిలిచింది. ఏపీ ఫోటో, వీడియోగ్రాఫర్స్ పూర్వ అధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి వారికి బహుమతులు అందజేశారు. నగరానికి చెందిన కన్యక స్టూడియో అధినేత చింతకుంట పుల్లయ్య మూడో స్థానంలో నిలిచిన బృందానికి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నగర శాఖ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కార్యదర్శి శివరామకృష్ణ, కోశాధికారి వీరబ్రహ్మం, ఉపాధ్యక్షులు జిలానీ, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి సహస్ర కలశాభిషేకం

- దేవుని కడప ఆలయంలో అర్చకుల ఏర్పాట్లు
- ఆలయ చరిత్రలో తొలిసారిగా ఈ పూజలు



దేవునికడపలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం



స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి క్షేత్రం తిరుమలకు తొలి గడపగా విలసిల్లుతోంది. ఈ స్వామికి నివేదిస్తే తిరుమలేశుడికి నివేదించిన పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ క్షేత్రంలో స్వామి సన్నిధిలో తరతరాలుగా సేవలందించిన అర్చకుల కుటుంబాలన్నీ కలిసి తొలి సారిగా ఈ నెల 19వ తేదీ నుంచి మూడు రోజులపాటు సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. అత్యంత వ్యయ ప్రయాసలతో స్వామిపై నిండైన భక్తితో అర్చకులు ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు.

తొలిసారిగా పూజలు

దేవుని కడప ఆలయ చరిత్రలో ఈ పూజలు తొలిసారిగా జరుగుతున్నాయి. టీటీడీ పర్యవేక్షణలో జరిగే ఈ ఉత్సవాలలో దేశంలోని పుణ్య నదీ జలాలతో నింపిన 1008 కలశాలను ప్రతిష్ఠించి మూడురోజులపాటు విశేష పూజలు నిర్వహిస్తారు. ముగింపు సందర్భంగా ఆ జలంతో స్వామి మూల మూర్తికి విశేష అభిషేకం నిర్వహించనున్నారు. దేశంలోని అన్ని పెద్ద నదుల జలాలు, అరుదైన ఔషధ, దేవతా వృక్షాల బెరడు, పవిత్ర దళాలు, పరిమళ ద్రవ్యాలు పూజల కోసం సేకరించే పనిలో పడ్డారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆగమ సలహాదారు రాజేష్ భట్టర్ ఆధ్వర్యంలో దేవుని కడప ఆలయ అర్చకులు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నారు. తిరుమలేశుని సన్నిధిలో మినహా మన ప్రాంతంలో ఎక్కడా ఇలాంటి ఉత్సవాలు నిర్వహించలేదు. దీంతో భక్తులు తరలి రావాలని నిర్వాహకులు విశేషంగా ప్రచారం చేస్తున్నారు.

కార్యక్రమాల వివరాలు

ఈ నెల 19వ తేదీ నుంచి సహస్ర కలశాభిషేకం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా తొలి రోజున ఉదయం 5.30 గంటల నుంచి భగవత్ విజ్ఞాపనం, విశ్వక్సేన ఆరాధన, సహస్ర కలశాభిషేక సంకల్పం, రక్షాబంధనం, అంకురార్పణ, వాస్తు యాగం, యాగ మంటప ద్వార తోరణ ఆరాధన, వేద, ప్రబంధ, స్తోత్ర పాఠ పారాయణం, అఖండ దీప స్థాపనం నిర్వహిస్తారు. రెండో రోజున ఉదయం 7.30 గంటల నుంచి సహస్ర కలశాధివాసం, పారాయణం, సాయంత్రం 5 గంటల నుంచి సహస్ర కలశావాహన ఆరాధన నిర్వహిస్తారు. మూడో రోజున ఉదయం 7 గంటల నుంచి సహస్ర కలశాభిషేకం, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ అలంకారం, పేరియ శాత్తుమొర, తీర్థ ప్రసాద, మహాశీర్వాదం, సాయంత్రం 5.00 గంటల నుంచి స్వామి వారి గ్రామోత్సవం ఉంటాయి.

ఫ్లెక్సీల చించివేత



కురబలకోట మండలం ముదివేడులో ఫ్లెక్సీని చించిన దృశ్యం

కురబలకోట : కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతున్న నేపథ్యంలో టీడీపీ నాయకుడు మలిగి మధుసూదన్‌రెడ్డి వివిధ ప్రాంతాల్లో వేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. అదే స్థానంలో మరో నాయకుడి ఫ్లెక్సీల జోలికి వెళ్లకపోవడంతో నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి.

ఏపీఎన్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ పదవికి రాజీనామా



బీహెచ్.ఇలియాస్

రాజంపేట : ఆంధ్ర ప్రదేశ్ నాన్ రెసిడెన్షియల్ తెలుగు సొసైటీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు గల్ఫ్ వైఎస్సార్‌సీపీ కో–కన్వీనర్ బీ.హెచ్.ఇలియాస్ తెలిపారు. మంగళవారం తన రాజీనామా పత్రాన్ని ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌కు పంపించామన్నారు. 28 ఏళ్లుగా గల్ఫ్ బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, తన సేవలను మెచ్చి మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి డైరక్టర్ పదవిని కట్టబెట్టారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాస్ పోర్టు రెన్యువల్, పోలీస్ క్లియరెన్స్ విషయంలో జాప్యం జరగకుండా ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ఛైర్మెన్ మేడపాటి వెంకట్‌తో కలిసి గల్ఫ్ బాధితులకు అండగా నిలిచామన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ వివిధ దేశాల నుంచి 55 వేల మందికి ఉచితంగా వసతులు కల్పించి సేవలందించామన్నారు. ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, వైఎస్.అవినాష్‌రెడ్డి సహకారంతో వారి సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని టమాటా రైతు మృతి



రామకృష్ణ (ఫైల్)

గుర్రంకొండ : గుర్తు తెలియని వాహనం ఢీకొని టమాటా రైతు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. మండలంలోని సంగసముద్రం గ్రామానికి చెందిన గంటా రామకృష్ణ(48) టమాటా పంట సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి టమాటా పంటకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. మార్గమధ్యంలో గుర్రంకొండకు సమీపంలోని ఏనుగుల చెరువు కట్ట మీద వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో రైతు గంటా రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

కృష్ణా నదిలో ప్రొద్దుటూరు వాసి మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : వైఎస్సార్ జిల్లాలోని ప్రొద్దుటూరుకు చెందిన నారాయణ వెంకటసుబ్బారావు(52) విజయ వాడ లోని కృష్ణా బ్యారేజ్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ పోలీసుల వివరాల మేరకు.. పట్టణం లోని వైఎంఆర్ కాలనీలో నివాసముంటున్న వెంకటసుబ్బారావుకు భార్య, లోహిత్, లోకేష్ కుమారులు ఉన్నారు. అతను చిన్న వ్యాపారాలు, కాంట్రాక్టర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లిన సుబ్బారావు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. స్విచ్చాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుమారుడు లోహిత్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే మంగళవారం విజయవాడ వద్ద కృష్ణా నది బ్యారేజ్‌లో సుబ్బారావు విగతజీవిగా కనిపించారు. అక్కడి పోలీసులు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు హుటాహుటిన విజయవాడకు వెళ్లారు. ఆత్మహత్యకు కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

వేంపల్లె : పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసుల్లో నిందితుడు శివకుమార్‌ను అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 23న రాత్రి పట్టణ శివారులోని హనుమాన్ జంక్షన్ వద్ద టీవీఎస్ స్టార్ సిటీ బైక్‌ను శివకుమార్, చిన్నా కలిసి చోరీ చేశారు. అనంతరం అక్కడి నుంచి పులివెందుల రోడ్డులోని టీచర్ల కాలనీలోని రామాలయం తాళం పగులగొట్టి గర్భ గుడిలో రాముడు, సీత, లక్ష్మణ, విఘ్నేశ్వరుడి వెండి కిరీటాలు, అభయహస్తం సీతమ్మ మెడలో గల బంగారు మంగళ సూత్రాన్ని చోరీ చేశారు. అదే బైక్ ద్వారా ఇడుపులపాయ అటవీ ప్రాంతంలో చోరీ చేసిన వెండి, బంగారు వస్తువులను దాచిపెట్టారు. సీతమ్మవారి బంగారు తాళిబొట్టును పీలేరులో తెలియని వ్యక్తికి రూ.10 వేలకు అమ్మి జల్సా చేశారు. ఈ నెల 10న ఇడుపులపాయలోని అటవీ ప్రాంతంలో దాచిన వెండి, బంగారు వస్తువులను తీసుకువచ్చే క్రమంలో వీరన్నగట్టుపల్లి సర్కిల్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. చోరీ చేసిన ఆభరణాల విలువ సుమారు రూ.2.30 లక్షల వరకు ఉంటుందని డీఎస్పీ వెల్లడించారు.

ఏఎస్‌ఐకు గాయాలు

కడప అర్బన్ : కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటిరెడ్డి సర్కిల్ సమీపంలో ఈ నెల 9వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటలిజెన్స్ విభాగంలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న సాంబశివయ్య గాయపడ్డారు. వెనుకవైపు నుంచి ఓ కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.